చెన్నైలో నీట మునిగిన ఆస్పత్రి ప్రాంగణం

తమిళనాడుకు రూ 8,480 కోట్లు ఇవ్వండి

లోక్‌సభలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎంపీలు

న్యూఢిల్లీ: భారీ వర్షాలతో అతలాకుతలమైన తమిళనాడు రాష్ట్రానికి తక్షణ సహాయం కింద రూ 8,480 కోట్లు మంజూరు చేయాలని ఎఐఎడిఎంకె ఎంపీ టిజి వెంకటేష్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో కురిసిన వర్షాలకు నష్టం భారీగా ఉందని, వెంటనే దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు.వరద పరిస్థితిపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఎంపీలు పాల్గొన్నారు. తమిళనాడులో ముఖ్యంగా చెన్నైలో నష్టం తీవ్రంగా ఉందన్నారు. కేంద్రం వరద సహాయ కార్యక్రమాల కోసం ఉదారంగా సహాయం చేయాలని కోరారు. యుద్ధ ప్రాతిపదికన సహాయ కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తమిళనాడు సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా కొన్ని ప్రాంతాల్లో వరద నష్టం తీవ్రంగా ఉందని అక్కడ కూడా వెంటనే సహాయ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.పశ్చిమ బెంగాల్‌లోని వరద ముంపు ప్రాంతాలకు రూ 6000 కోట్లు మంజూరు చేయాలని టీఎంసీ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ కోరారు.

ఎయిర్‌టెల్ వినియోగదారులకు రూ 30 టాక్‌టైం

వరద ముంపుతో ఇబ్బంది పడుతున్న ఎయిల్‌టెల్ వినియోగదారులకు ఎయిం ్‌టెల్ సంస్థ రూ 30 టాక్‌టైం సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఈ మొత్తాన్ని బిల్లులో తరువాత వసూలు చేస్తామని ఆ కంపెనీ పేర్కొంది.

అదే విధంగా ముందస్తుగా 50 ఎంబీ ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని ఆ సంస్థ అధికారులు పేర్కొన్నారు. ఈ రెండు సౌకర్యాలను ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఎయిల్‌టెల్ టు ఎయిర్‌టెల్ వినియోగదారులకు మాత్రం 10 నిమిషాల టాక్‌టైంను ఉచితంగా సమకూర్చారు.

వరద బాధితుల సహాయానికి ఎంపీల్యాడ్స్ నిధులు

- రాజ్యసభలో ఏచూరి ప్రతిపాదనకు సభ్యుల మద్దతు

న్యూఢిల్లీ : తమిళనాట ఎదురైన భారీ ప్రకృతి విపత్తును ఎదుర్కోవడానికి రాజ్యసభ సభ్యులు తమ ఎంపీల్యాడ్స్ నిధులను అందించడానికి సిద్ధపడ్డారు. కొంత మంది సభ్యులు సభలో వేర్వేరు మొత్తాలలో సహాయ నిధులను ప్రకటించారు. బుధవారం ఉదయం సభలో తమిళనాడు విపత్కర పరిస్థితిపై చర్చ ప్రారంభించారు. రానున్న రెండు రోజుల్లో మరిన్ని వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వెంకయ్య నాయుడు అన్నారు. 'నేను తీవ్రంగా ఆందోళన చెందుతున్నాను. దేవుడు ప్రజలందరినీ రక్షించాలని వేడుకుంటున్నాను' అని ఆయన సభలో అన్నారు. పరిస్థితిని ఎదుర్కోవడం కోసం తక్షణ, దీర్ఘకాలిక సలహాలు ఇవ్వాలని ఆయన సభ్యులను కోరారు. ఈ క్లిష్ట పరిస్థితిలో ఒకరినొకరం విమర్శించుకోవడం తగదని ఆయనన్నారు. కేంద్రం ఇప్పటికే రూ. 933 కోట్లు ప్రకటించిందని ఆయన చెప్పారు. ఈ దశలో సీపీఎం ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మాట్లాడుతూ, 'చెన్నైలో సహాయ పనుల కోసం మనం ఎంపీల్యాడ్స్ నిధులను కేటాయించవచ్చు' అని ప్రతిపాదించారు. ఏచూరి ప్రతిపాదనను విపక్ష నేత గులాం నబీ ఆజాద్ సమర్థించారు. 'అందరం ఎంపీల్యాడ్స్ నిధులను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నాం. నిధుల మొత్తాన్ని ఛైర్మన్ సలహాతో నిర్ణయిద్దాం' అని డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ అన్నారు. స్థానిక నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంపీల్యాడ్స్ నిధులను ఉభయ సభల సభ్యులు ఎప్పటికప్పుడు ఖర్చు చేస్తారనే విషయం తెలిసిందే.

బీజేపీకి ఓటువేయనందుకు దళితవాడపై దాడి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రతాప్‌ఘర్ (యుపి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సభ్యుడికి ఓటు వేయనందుకు ఆ పార్టీ కార్యకర్తలు ఒక దళితవాడపై దాడికి దిగారు. ఈ ఘటనలో ముగ్గురు దళితులు తీవ్రంగా గాయపడ్డారు. అంటు ప్రాంతంలోని కమలుద్దీన్‌పూర్ గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ గ్రామంలో బీజేపీ సభ్యుడు బల్వంత్ సింగ్ కుటుంబ సభ్యుడు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీకి దిగారు. మంగళవారం ఓటింగ్ పూర్తయిన తర్వాత, బల్వంత్ సింగ్ తన కుమారులు, ఇతర పార్టీ కార్యకర్తలతో కలసి దళిత బస్తీలోకి చొరబడ్డారు. తమ పార్టీకి ఓటువేయలేదంటూ తిడుతూ శ్రీరాం(55), ఆయన కుమారుడు రాం కృపాల్ (30), మరో వ్యక్తిని తీవ్రంగా కొట్టారని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఈ ముగ్గురు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. కేసు నమోదుచేశామని, దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.

పల్లెల్లో చెయ్యిదే పైచెయ్యి

- కమలానికి పట్టణాల్లోనే పట్టం
- గుజరాత్ స్థానిక ఎన్నికల ఫలితాలు

అహ్మదాబాద్ : గుజరాత్‌లో స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికలలో బీజేపీ చేదు ఫలితాలు చవి చూసింది. బీజేపీ గెలుపు పట్టణాల వరకే పరిమితం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో అది తుడిచిపెట్టుకుపోయింది. పల్లెపట్టుల్లో కాంగ్రెస్ ముందంజ వేసింది. కొన్ని పట్టణాల్లోనూ కాంగ్రెస్ బీజేపీకి గట్టి పోటీ ఇచ్చింది. మొత్తం 31 జిల్లా పంచాయతీలలో కాంగ్రెస్ 21 స్థానాలు గెల్చుకున్నది. అయితే కొంత మెజారిటీ తగ్గినప్పటికీ మొత్తం ఆరు మున్సిపల్ కార్పొరేషన్లనూ గెల్చుకొని బీజేపీ పట్టణాలపై తన పట్టును నిలబెట్టుకుంది. అలాగే చిన్న చిన్న పట్టణాలలోని 56 మున్సిపాలిటీలలో 40 స్థానాలను బీజేపీ గెల్చుకున్నది. అహ్మదాబాద్, రాజ్‌కోట్, సూరత్, వడోదరా, జామ్‌నగర్, భావ్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్‌లను బీజేపీ మరోసారి కైవసం చేసుకుంది. అయితే ఈ నగరాలను ఆనుకొని ఉన్న గ్రామీణ ప్రాంతాలలో బీజేపీకి ఓటమి ఎదురైంది. అహ్మదాబాద్, రాజ్‌కోట్, వడోదరా, జామ్‌నగర్, మెహసానా, జూనాగఢ్ జిల్లా పంచాయతీలలో అది పరాజయం పాలైంది. ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ సీఎం ఆనందీబేన్ స్వస్థలమైన మెహసానా జిల్లా పంచాయతీ, మున్సిపాలిటీ రెండింటిలోనూ కాంగ్రెస్ విజయ ఢంకా మోగించింది. ఈ ఫలితాలను బట్టి గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీపై పాటీదార్ ఉద్యమ ప్రభావం పడినట్టుగా స్పష్టమవు తోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యతిరేకత, అధిక ధరల ప్రభావం, రైతాంగ దుస్థితి వంటివి కూడా కారణాలుగా పని చేసినట్టు కనిపిస్తోంది. బీజేపీకి గ్రామీణ ప్రాంతాలలో బలమైన నాయకత్వం లేకపో వడం కూడా ఈ ఓటమికి కారణమని విశ్లేషకుల అంచనా. ఆనందీబేన్, అమిత్ షా సహా మంత్రివర్గంలోని సభ్యులంతా పట్టణ ప్రాంతాలకు చెందిన వారే కావడం గమనార్హం. కాంగ్రెస్‌ది సరిగ్గా దీనికి భిన్నమైన పరిస్థితి. 43 శాతం పట్టణ జనాభా కలిగిన గుజరాత్‌లో కాంగ్రెస్‌కు తగినంత పట్టణ నాయకత్వం, సంస్థాగత నిర్మాణం లేవు. 'మేం పట్టణ సంస్థలను గెల్చుకున్నాం కానీ, పంచాయతీల్లో పార్టీకి ఓటమి ఎదురైంది' అని బీజేపీ అధికార ప్రతినిధి ఐకే జడేజా అన్నారు.

వారి హత్యలకు పరస్పర సంబంధం లేదు

- హేతువాదుల హత్యలపై ప్రభుత్వ వివరణ

న్యూఢిల్లీ : ప్రముఖ హేతువాదులు గోవింద పన్సారే, నరేంద్ర దాభోల్కర్, ఎం.ఎం. కాల్బుర్గి హత్య కేసుల్లో సారూప్యత ఏదీ లేదని ప్రభుత్వం రాజ్యసభకు తెలిపింది. బుధవారం నాడు హోం మంత్రి కిరెన్ రిరిజూ లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ప్రభుత్వానికి అందిన సమాచారం ప్రకారం, ఈ హత్యల వెనుక పరస్పర సంబంధం కాని, సారూప్యత కాని ఏదీ లేదని స్పష్టం చేశారు.

ఈ ఏడాది 136 భూకంపాలు

న్యూఢిల్లీ : దేశంలో ఈ ఏడాది మొత్తం 136 భూకంపాలు సంభవించాయి. గత మూడు దశాబ్దాల గణాంకాలను పరిశీలిస్తే వీటి సంఖ్యలో పెద్ద మార్పు లేదని ఎర్త్ సైన్స్ మంత్రి హర్షవర్ధన్ లోక్‌సభలో బుధవారం ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అత్యధిక ప్రమాదంగల జోన్-5లో 114 ప్రాంతాలను గుర్తించామని, అత్యధిక నష్టం జరిగే జోన్-4లో 14 ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు.



చెదిరిన చెన్నై

చెన్నై: కనీవినీ ఎరుగని భారీ వర్షాలతో చెన్నై నగరం కకావికలమైంది. కొద్ది రోజుల క్రితమే విధ్వంసం సృష్టించిన వర్షాలు మరోసారి చెన్నై సహా తమిళనాడులోని చాలా ప్రాంతాలను ముంచెత్తాయి. రాష్ట్రంలో రవాణా పూర్తిగా స్తంభించింది. మోటారు సైకిల్ నుంచి విమానం వరకు అన్నీ రవాణా సౌకర్యాలు నిలిచి పోయాయి. బంగాళాఖాతం రెండుగా చీలిపోయిందా అన్నట్టు ఎటు చూసినా చెన్నైలో వరద నీరే కనిపిస్తోంది. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మొబైల్ సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దీంతో చెన్నై నగరానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. టీవీ ప్రసారాలదీ ఇదే పరిస్థితి. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు మంగళవారం కూడా జనజీవనం స్తంభించింది. చెరువులు, కుంటలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. చెన్నై నగరానికి మంచినీటి సరఫరా చేసే చెరువులన్నీ నిండిపోయాయి. అదనపు నీటిని వదిలేందుకు అధికారులు గేట్లను ఎత్తేశారు. దాంతో వరద నీరు పల్లపు ప్రాంతాలకు చేరుకున్నది. చెన్నైలో గత శతాబ్దంలో ఎన్నడూ లేనంత భారీ వర్షం ఈ మారు నమోదైంది. మూడు మాసాల్లో కురవాల్సిన వర్షం మూడు రోజుల్లోనే కురిసింది. పాలార్ నది పొంగిపొర్లడంతో వలాజాబాద్-తిరులివనం వంతెనను మూసి వేశారు. దీంతో 17 గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. పోలింగనల్లూర్, వేళంచేరి, సైదాపేట, కొరట్టూర్, అన్నానగర్, ప్రాంతాల్లో నీరు ఇండ్ల మొదటి అంతస్తు వరకు చేరింది. దీంతో బాధితులను నావికా విభాగం సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు చేర్చింది. అడయార్ వంతెన వద్ద 20 మంది గజ ఈతగాళ్లతో సహాయ చర్యలు చేపట్టారు. చెన్నై నుంచి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ రద్దయ్యాయి. లోకల్ రైళ్లు నిలిచి పోయాయి. చెన్నై విమానాశ్రయం చెరువును తలపిస్తోంది. విమానాలు పడవల్లా కనిపిస్తున్నాయి. ఎయిర్‌గ్రౌండ్ ఫ్లోర్ నీట మునిగింది. దీంతో విమాన సర్వీసులను పూర్తిగా నిలిపి వేశారు. 400 మంది ప్రయాణికులు చెన్నై విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. విమానాలను కోయంబత్తూరు, తిరుచ్చి, బెంగళూరుకు మళ్లిస్తున్నారు. చెన్నైలో సహాయ కార్యక్రమాల కోసం తిరుపతిలో రెండు విమానాలను మోహరించారు. ఇండియన్ ఎయిర్స్ చేతక్ హెలికాప్టర్లతో సహాయ కార్యక్రమాలు చేపట్టారు. తమిళనాడులో వరద బీభత్సంపై ముఖ్యమంత్రి జయలలిత అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. సహాయ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. సహాయం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారీ వర్షాలకు తమిళనాడులో ఇప్పటి వరకు 188 మంది మరణించారని ప్రభుత్వం ప్రకటించింది. తీర ప్రాంతాల కలెక్టర్లు, అప్రమత్తంగా ఉండాలని, ప్రజా రక్షణ కోసం ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

తమిళనాడు వరదలపై ప్రధాని సమీక్ష

వరద బీభత్సంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమిళనాడు సీఎం జయలలితతో ఫోన్‌లో మాట్లాడారు. వరద సహాయ కార్యక్రమాలు ఎలా అమలు జరుగుతున్నాయని అడిగి తెలుసు కున్నారు. కేంద్రం నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని జయలలితకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సహాయ పునరావాస కార్యక్రమాల నిమిత్తం మంగళవారమే సైన్యం రంగప్రవేశం చేసింది. సోమవారం రాత్రి ప్రారంభమైన భారీ వర్షం మంగళవారం రాత్రి వరకు కొనసాగినట్టు సమాచారం. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకొస్తున్నారు.

రైళ్లు రద్దు

తమిళనాడు నుంచి తెలుగురాష్ట్రాలకు, తెలుగు రాష్ట్రాల నుంచి తమిళనాడు వైపు వెళ్లే భారీ వాహనాలు, బస్సుల రాకపోకలపై తీవ్రమైన ప్రభావం పడింది. చెన్నై- తడ, తడ -నెల్లూరు, నెల్లూరు- గూడూరు మార్గాల్లో రోడ్డు మార్గం దెబ్బతింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అనేక మార్గాల్లో వరద నీరు రైలు పట్టాలపై నుంచి ప్రవహిస్తుండటంతో పాటు పలు ప్రాంతాల్లో ట్రాక్‌ల కింద ఉన్న మట్టి, కంకర కొట్టుకుపోయాయి. దీంతో వివిధ ప్రాంతాల నుంచి చెన్నై వెళ్లాల్సిన అనేక రైళ్లు రద్దు చేసింది. ఇదిలావుండగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లనురద్దు చేసింది, మరికొన్ని రైళ్లను దారి మళ్లించింది. కాకినాడ-చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-చెన్నై చార్మినార్ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ- చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ -శ్రీమాత వైష్ణోదేవి కట్ర అండమాన్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్, చెన్నై సెంట్రల్-అహ్మదాబాద్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-న్యూ జల్పాయిగురి ఎక్స్‌ప్రెస్, విజయవాడ-చెన్నై సెంట్రల్ -విజయవాడ పినాకిని ఎక్స్‌ప్రెస్ పాక్షికంగా రద్దు చేసింది. భువనేశ్వర్‌కు వెళ్లాల్సిన భువనేశ్వర్-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ దారి మళ్లించారు. వయా తిరుపొట్టియూర్, పెరంబదూర్, కాట్పాడి, విల్లీపురం మీదుగా నడిపిస్తున్నారు. త్రివేండ్రం వెళ్లాల్సిన త్రివేండ్రం సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌ను వేపాకం, తిరుత్తని, రేణిగుంట, గూడూరు మీదుగా మళ్లించారు. ముంబాయి వెళ్లాల్సిన సెంట్రల్ ముంబాయి- నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైలును వయా వేపాకం, తిరుత్తని, రేణిగుంట, గూడూరు మీదుగా దారి మళ్లించారు. చెన్నై సెంట్రల్- సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ- చెన్నై ఎగ్మోర్ రైళ్ల రద్దు చేశారు. త్రివేండ్రం-గౌహతి ఎక్స్‌ప్రెస్, ముంబాయి సీఎస్టీ -నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించారు.

హెల్ప్‌లైన్ నెంబర్లు

రైళ్ల సమాచారం తెలుసుకునేందుకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రైల్వే స్టేషన్లలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు సమాచారం అందిస్తోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ - 040-27786170, 27700868, విజయవాడ రైల్వే స్టేషన్ - 0866-2575038, గుంటూరు రైల్వే స్టేషన్ -0863-2222014, గూడూరు రైల్వే స్టేషన్ -78423 07028

137 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా నిలిచిపోయిన 'ద హిందూ'

- చెన్నై కుండపోత ప్రభావం

THE HINDU

చెన్నై : తమిళనాడు కుండపోత ప్రభావం 'ద హిందూ' పత్రికపై కూడా పడింది. దేశంలోనే అతి ప్రాచీన ఆంగ్ల వార్తా పత్రిక 'ద హిందూ' భారీ వర్షాలు, వరదల కారణంగా 137 చరిత్రలో తొలిసారిగా ప్రచురణ ఆగిపోయి ంది. ఈ పత్రిక చెన్నై కేంద్ర కార్యాలయంగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. 1878లో నుంచి డైలీ వార్తా పత్రికగా ముద్రితమవుతున్న ఈ పత్రిక బుధవారం చెన్నై ఎడిషన్ ప్రచురణ నిలిచిపోయింది. పత్రిక చరిత్రలో తొలిసారిగా ఇలా జరిగిందని ఆ పత్రిక పబ్లిషర్ ఎన్ మురళి చెప్పారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చెన్నైలో విమాన, రైల్వే సర్వీసులకు అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. వేలాది మంది విద్యుత్ లేకుండానే కాలం వెళ్లదీస్తున్నారు. 'మా ప్రింటింగ్ ప్రెస్ నగరానికి 30 కిలో మీటర్ల దూరంలోని మురైమలైనగర్ టౌన్‌షిప్‌లో ఉంది. సిబ్బంది అక్కడకు చేరుకునే పరిస్థితిలేదు. ఇబ్బందులను ఎదుర్కొని ప్రింటింగ్ చేసినా, నగరంలో పంపిణీ సందేహాస్పదమే' అని మురళి చెప్పారు. టైమ్స్ ఆఫ్ ఇండియా, డెక్కన్ క్రానికల్, న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లు పత్రికను ముద్రించినప్పటికీ, నగరంలోని పాఠకులకు ఎంతవరకు చేరిందనేది సందేహమే.

గుజరాత్‌లో అల్లర్లకు దావూద్ ఇబ్రహీం కుట్ర

- నేపాల్‌లో ఇద్దరు అనుచరుల అరెస్టు

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో గూఢచర్యం చేస్తున్న లింకులు వెలుగుచూశాక.. తాజాగా నిఘా సంస్థలైన ఐబీ,రా సంయుక్తంగా జరిపిన దాడు ల్లో అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం ఇద్దరు అనుచరులు బుధవారం నేపాల్‌లో చిక్కారు. ఆబిద్ దావూద్ పటేల్,సలీం సత్తార్ షార్ప్ షూటర్లు. వీరిద్దరూ దావూద్‌కు అతి అనుంగులమని దర్యాప్తు సంస్థలముందు అంగీకరించారు. దావూద్ ఆదేశం మేరకే తాము గుజరాత్ బరోచ్ బీజేపీ అధ్యక్షుడు శ్రీష్ బంగాలీ, యువమోర్చా అధ్యక్షుడు ప్రగ్నేష్ మిస్త్రీని హత్య చేశామన్నారు. గుజరాత్ మతఘర్షణలు చేయించేలా దావూద్ వ్యూహం పన్నాడని తెలిపారు.

'వీకే సింగ్ క్షమాపణ చెప్పాలి'

న్యూఢిల్లీ : ఇటీవల కేంద్ర మంత్రి వీకే సింగ్ చేసిన వ్యాఖ్యలు లోక్‌సభలో బుధవారం దుమారం రేకెత్తించాయి. మంత్రి ఇటీవల జరిగిన ఒక దళితుని కుటుంబం సజీవ దహనం సంఘటనపై మాట్లాడుతూ, వారిని కుక్కలతో పోల్చడంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు కురిపించాయి. ఆయనపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ వాకౌట్ చేసింది. ఇదే డిమాండ్‌తో తృణమూల్ కాంగ్రెస్, ఇతర వామపక్షాలు కూడా సభనుంచి వాకౌట్ చేశాయి. ఉదయం సభ సమావేశం ప్రారంభించిన వెంటనే, కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తడానికి ప్రయత్నించింది. అయితే ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేయాలని కోరుతూ తనకు అందిన నోటీసులన్నిటినీ తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు సభ మధ్యలోకి దూసుకువచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ప్రారంభిం చారు. కాంగ్రెస్ సభా నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, అసహనంపై చర్చ సమయంలో కూడా ప్రభుత్వం దళితులపై సింగ్ వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని గుర్తుచేశారు. ఆయనపై చర్య తీసుకునే విషయంపై కూడా ప్రధాని నోరు మెదప కపోవడాన్ని ఆయన తప్పుప ట్టారు. ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తరువాత మరోసారి కాంగ్రెస్ ఈ అంశం ప్రస్తావించేందుకు ప్రయత్నించింది. ఖర్గే మాట్లాడుతూ ని ప్రభుత్వ వైఖరికి మేము నిరసన వ్యక్తంచేస్తున్నాం.... వాళ్లు (ప్రభు త్వం) మా మాట వినాలి అని తమ డిమాండ్‌ను మరోసారి వినిపించారు. స్పీకర్ అనుమతించకపోవడంతో ఖర్గేతో సహా ఇతర కాంగ్రెస్ సభ్యులందరూ నిరసనగా సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. కాంగ్రెస్ డిమాండ్‌పై స్పీకర్ స్పందిస్తూ ఈ విషయంపై రాజ్‌నాథ్ సింగ్ సవివరంగా సమాధానం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు కనుక సభలో లేరని అన్నారు. పార్లమెంటరీ వ్యవహా రాల మంత్రి

గుజరాత్‌లో కార్మిక వ్యతిరేక చట్టం

- ఆమోదించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ : వివాదాస్పద గుజరాత్ కార్మిక చట్టాల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఇందులో ప్రజోపయోగ సేవలలో ఒక సంవత్సరం పాటు సమ్మెలపై నిషేధం విధించే నిబంధన ఉంది. ఈ బిల్లును, వివాదాస్పద గుజరాత్ బెర్రరిజం నిరోధక బిల్లు (జీసీటీఓసీ)తో పాటు రాష్ట్రపతి ఆమోదానికి ఇదివరకే పంపించారు. అయితే బెర్రరిజం నిరోధక బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం ఇంకా లభించలేదు. ఈ రెండు బిల్లులపై రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రతిపక్షం నుంచి నివేదికలు అందాయి. ఈ సంవత్సరం మొత్తం 65 రాష్ట్ర చట్టాలను రాష్ట్రపతి ఆమోదానికి పంపించగా వాటిలో 34 చట్టాలపై మాత్రమే రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం సెప్టెంబర్‌లోనే లభించిందని, దాన్ని అమలులోకి తేవడం కోసం తామింకా గెజెట్‌లో నోటిపై చేయాల్సి ఉందని గుజరాత్ ప్రభుత్వ పార్లమెంటరీ కార్యదర్శి సీజే గోఠీ అన్నారు. ఈ బిల్లును గత ఫిబ్రవరిలో గుజరాత్ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా, ప్రతిపక్షాలన్నీ దీనిని 'కార్మిక వ్యతిరేక', 'పెట్టుబడిదారీ అనుకూల' చట్టమని అభివర్ణిస్తూ సభలోంచి వాకౌట్ చేశాయి. ఈ చట్టంలో ఉన్న అత్యంత వివాదాస్పద సవరణ ఏమిటంటే, వివాదాల పరిష్కారానికి కార్మికులూ, యజమానీ కోర్టుకు బైట, ప్రభుత్వానికి కొంత డబ్బు ఫీజుగా చెల్లించి రాజీ కుదుర్చుకోవచ్చు. కార్మికులకు కోర్టుల చుట్టూ తిరిగే పని లేకుండా పోతుందని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వం పరిశ్రమాధిపతుల నుంచి రూ. 21,000 వరకు జరిమానా వసూలు చేసి 75 శాతం డబ్బును బాధిత కార్మికులకు అందించేలా ఈ చట్టంలో నిబంధన ఉందని అది చెబుతోంది. అయితే ఇది కార్మికులకు న్యాయపరమైన రక్షణ లేకుండా చేయడమేననే విమర్శలున్నాయి.

రాజ్యసభలో 'కులం' రగడ

- కేంద్ర మాజీ మంత్రి షెల్జా వ్యాఖ్యలపై దుమారం

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని ఓ ఆలయంలో తనను కులం అడిగారంటూ కాంగ్రెస్ ఎంపి కుమారి షెల్జా చేసిన వ్యాఖ్యలపై రాజ్యసభలో దుమారం రేగింది. బుధవారం ఉదయం జీరో అవర్‌లో మంత్రులు అరుణ్‌జైట్లీ, పీయూష్ గోయల్ చేసిన ప్రకటనలు కాంగ్రెస్ సభ్యులకు ఆగ్రహం కలిగించాయి. ఇరుపక్షాల మధ్య వాదోపవాదనలు, పరస్పర ఆరోపణలు, కాంగ్రెస్ సభ్యుల నిరసనల మధ్య సభ పలుమార్లు వాయిదా పడింది. సోమవారం రాజ్యాంగంపై చర్చ సందర్భంగా కుమారి షెల్జా మాట్లాడుతూ..తాను యుపిఏ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా ఉన్నపుడు గుజరాత్‌లోని ద్వారక ఆలయాన్ని సందర్శించానని, ఆ సమయంలో తన కులమేమిటని అక్కడి నిర్వాహకులు అడిగినట్టు ఆమె తనకెదురైన అనుభవాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా గుజరాత్ నమూనానే అనుసరిస్తోందంటూ ఆమె విమర్శించారు. ఆ సమయంలో గుజరాత్ సిఎంగా నరేంద్రమోడీ ఉన్నారన్న విషయం గమనార్హం. దీనిపై బుధవారం జీరో అవర్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సమాధానమిస్తూ.. ఆ ఆలయ నిర్వహణ ఎంతో అద్భుతంగా ఉందని షెల్జా అభినందించారంటూ విజిటర్స్ బుక్‌లో ఆమె రాసిన వ్యాఖ్యల్ని చదివి వినిపించారు. 2013, ఫిబ్రవరి 22న సందర్శకుల పుస్తకంలో ఆమె సంతకం చేసిన కాపీని మంత్రి సభలో ప్రదర్శించారు. దీనిపై షెల్జా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. తాను ఆ వ్యాఖ్యలు రాసింది ద్వారక ప్రధాన ఆలయంలో కాగా, తనను కులం అడిగింది బెట్ ద్వారకలో అంటూ వివరణ ఇచ్చారు. తాను దళితురాలినైనందునే తనను అవమానించారంటూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఈ దశలో అధికారపక్షం మంత్రులకూ, కాంగ్రెస్ సభ్యులకూ మధ్య పరస్పరవాదోపవాదనలతో సభలో గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ సభ్యులు కృత్రిమ వివక్ష గురించి ప్రస్తావిస్తూ కృత్రిమ సమస్యలు సృష్టిస్తున్నారంటూ విద్యుత్‌శాఖ మంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. దాంతో, ఆగ్రహించిన కాంగ్రెస్ సభ్యులు షెల్జా నేతృత్వంలో వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రైతులను, వ్యవసాయ కార్మికులను ఆదుకోండి

- కేంద్రానికి ఎఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ డిమాండ్

న్యూఢిల్లీ : తమిళనాడులో ప్రత్యేకంగా ఉత్తర కోస్తా జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల్లో దాదాపు 200 మంది మృతిచెందడంపట్ల అఖిల భారత కిసాన్ సభ (ఎఐకేఎస్), అఖిల భారత వ్య